క్లుప్తంగా

మాచర్ల ఎంఈవోగా కాంతారావు బాధ్యతల స్వీకరణ



మాచర్ల: మాచర్ల పట్టణ, మండల విద్యా శాఖ అధికారిగా కె.కాంతారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయపురిసౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాంతారావును పల్నాడు జిల్లా విద్యా శాఖ అధికారులు మాచర్ల ఎంఈవో-1గా నియమించారు. ఎంఈవో కార్యాలయంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంఈవో వేముల నాగయ్య, ఎంఈవో-2 సురేష్, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు కె.వెంకటరమణ, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, శ్రీధర్ గుప్తా, శివ, రామకృష్ణ శాస్త్రి, జె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండలంలోని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కాంతారావును అభినందించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ మండల శాఖ విద్యాధికారిగా విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, పాఠశాలల నిర్వహణ, అన్ని సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కౌలు రైతు బొరిగొర్ల నాగరాజు (41) గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో బుధవార రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత ఐదేళ్లుగా సేద్యంలో వచ్చిన అప్పుల వల్ల నాగరాజు ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. మూడెకరాలు కౌలుకు తీసుకుని సేద్యం చేశాడని ప్రతి ఏటా అప్పుల వుతూ అవి ప్రస్తుతం రూ.9.5 లక్షల దాకా అయ్యాయని ఈ నేపథ్యంలో నాగరాజు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): మండల పరిధిలోని పెద కంచర్ల గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయాన్ని గ్రామస్తులు పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాన్యుడి ఆయుధం సమాచార హక్కు చట్టం



నకరికల్లు: సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు ప్రభుత్వ కార్యాలయాల్లో పరిష్కారం పొందవచ్చని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు శ్రీశైలం నాగార్జున, రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసాద్‌లు అన్నారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో చట్టం ప్రయోజనాలు, వినియోగంపై స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సెంటర్‌లో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల నుంచి సమాచారాన్ని ఈ చట్టం ద్వారా పొందవచ్చని అన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా పనిచేయాలంటే ఈ చట్టం ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు ముజావర్ జాన్‌అహ్మద్, ఉపాధ్యక్షుడు బద్దుల నాగేశ్వరరావు, కార్యదర్శి బి.వి.గిరి, ఆర్.ఎన్.రెడ్డి, ఎ.నాగేశ్వరరావు, కొప్పుల వెంకటేశ్వర్లు, వి.రాజేశ్వరరావు, ఎన్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో సాధు సంతుల ఆత్మీయ సమావేశం



వినుకొండ(నూజెండ్ల): శాంతి ఆశ్రమం ట్రస్ట్, హిమాలయ గురువు ఆధ్వర్యంలో తొలి ఏకాదశి తృతీయ అఖండజ్యోతి ప్రజ్వలన మన రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 108 మంది సాధుసంతులు విచ్చేసి నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన సమావేశంలో అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం సర్వలోక కల్యాణార్థమై జరిపించామని, రైతులు, వ్యాపారుల కార్మికులు ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భూగర్భ జలాలు పెరిగి ప్రకృతి పచ్చదనంతో పరవశించాలన్నారు. అనంతరం సాధు సంతులను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు కనిగండ్ల కోటేశ్వరరావు, పెండేల పుల్లారావు, కాశీ, సురేష్, ఆర్ఎస్ఎస్ తరపున కాశీ, గజవల్లి పవన్, భాగవత్ రవికుమార్ సారథ్యం వహించారు. కడప జిల్లా కంది మల్లాయపల్లె బ్రహ్మంగారి మఠం వీరబ్రహ్మేంద్ర స్వామి 8వ తరం ముని మనవడు నొస్సం వీరం భట్లయ్య స్వామి పాల్గొన్నారు.

అంతిమ సంస్కారంలోనూ ఇబ్బందులే..!





రెంటచింతలలోని ముళ్లపొదలతో ఉన్న హిందూ శ్మశాన వాటికలు

- అధ్వానంగా హిందూ శ్మశాన వాటికలు
- ముళ్లపొదలతో చిట్టడవిని తలపిస్తున్న వైనం
- నీళ్లులేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రతి ధర్మంలోనూ వారి శాస్త్రానుసారం అనేక పద్ధతులు ఉంటాయి. అవి పుట్టుక నుంచి చావు వరకు ఎవరి ధర్మాలను అనుసరించి వారు నిర్వర్తిస్తారు. అలాగే హిందూ ధర్మంలోనూ పుట్టుక నుంచి చావు వరకు శాస్త్రానుసారం అనేక నియమాలున్నాయి. ఆయా నియమాలను ఆయా దశలలో అనుసరిస్తుంటారు. అయితే హిందూ కుటుంబంలో ఎవరైనా చనిపోతే ధర్మానుసారం అనుసరించాల్సిన కొన్ని నియమాలు ఉంటాయి. కానీ చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహించే శ్మశానంలోనూ సరైన సౌకర్యాలు ఉండాలి కదా.. చివరికి అంతిమ సంస్కారంలోనూ అడ్డంకులు ఎదురైతే ఎలా..? దీనిని కొందరు చాదస్తం అని కొట్టిపారేయవచ్చు.

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని రెండు శ్మశాన వాటికలు చిట్టడవిని తలపిస్తూ అధ్వానంగా ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఏ హిందువు మృతి చెందినా.. వారికి దహన సంస్కారం దహన సంస్కారం కుటుంబ సభ్యులు, బంధువులు అష్టకష్టాలు పడుతున్నామని వాపోతున్నారు. సనాతన ధర్మంలో హిందూ సంప్రదాయంలో అంత్యక్రియలు నిర్వహించిన అనంతరం 3వ రోజు పిండ ప్రదానం చేస్తారు. స్థానిక ఒక హిందూ శ్మశానంలో ఏర్పాటు చేసిన బోరు మరమ్మతులకు గురి కాగా, మరో హిందూ శ్మశానంలో బోరు వేసి చేతిపంపును ఏర్పాటు చేయకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో నీటి వసతి లేకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో సుమారు 3 వేలకు పైగా ఉన్న హిందు కుటుంబాల వారు దహన సంస్కారం చేయాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రెండు హిందూ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంత్యక్రియలు చేయాలంటే ప్రాణం పోతోంది



గ్రామంలోని ఏ హిందూ కుటుంబంలో ఎవరు మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించాలంటే ప్రాణం పోతుంది. హిందూ శ్మశానాలు ముళ్ల పొదలతో నిండి ఉండటంతో లోపలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దహన సంస్కారం పూర్తి అయిన వెంటనే స్నానం చేయాలంటే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గోలి వాగుకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హిందూ శ్మశానాలలోని ముళ్ల పొదలను తొలగించి బోర్లకు మరమ్మతులు చేయడానికి చర్యలు చేపట్టాలి.

నారాయణపురం శ్రీనివాస్, కన్నెగంటి హనుమంతు సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, రెంటచింతల

సమష్టిగా పనిచేద్దాం.. అంటువ్యాధులు నివారిద్దాం

ఎంపీడీవో కె.సరోజినీదేవి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కె.సరోజినీదేవి

మాచర్ల రూరల్: గ్రామాలలో ప్రబలుతున్న అంటు వ్యాధులకు మెడికల్, శానిటేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమష్టిగా పనిచేసి నివారణ చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కె.సరోజినీదేవి ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలలో ప్రజలు తాగుతున్న నీటిని పరిశీలించాలని, పైపుల లీకేజీ ద్వారా కలుషిత నీరు ప్రవహిస్తుందేమోనని తనిఖీ చేయాలన్నారు. అలాగే వీధులను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టి దోమల నివారణకు శానిటేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ సిబ్బంది గ్రామాల్లో ఎవరైనా వ్యాధుల బారిన పడుతుంటే వారికి తక్షణ చికిత్స అందించి వారికి సంబంధించిన అన్ని పరీక్షలను వెనువెంటనే జరిపించి తగు మందులు అందించాలని కోరారు. డయేరియా, మలేరియా, డెంగీ తదితర అంటు వ్యాధులు ప్రబలకుండా మనందరం సమష్టిగా పనిచేసి ప్రజలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించుదామని కోరారు. ఈ సమావేశంలో పీహెచ్‌సీ వైద్యులు వెస్లి, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు శ్రీనివాసరావు, లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు బిట్టు వెంకటేశ్వర్లు, ఆవుల వెంకట్రామయ్య, బాబులాల్ నాయక్, సత్యనారాయణ, కోటేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గురజాల : స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో నవులూరి వెంకట్రావు జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నవులూరి శ్రీనివాసరావు, కావూరి నాగయ్య, బ్రహ్మం, జానకీరామ్ గూడూరి, ఆశ్రమ నిర్వాహకుడు చింతకాయల ఏసయ్య ఉన్నారు.

రెండు గ్రామాల్లో 'ఉపాధి హామీ' గ్రామసభలు

దమ్మాలపాడు (ముప్పాళ్ళ): మండలంలోని రెండు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా సోమవారం గ్రామసభలు నిర్వహించారు. కొత్త కార్డులు మంజూరు చేయాలని స్థానికులు కోరారు. పాత కార్డులను కూడా రెన్యువల్ చేయడం లేదని చెప్పారు. మస్టర్ షీట్‌లో లోపాలున్నట్లుగా అధికారులు గుర్తించారు. తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. గ్రామసభలో సర్పంచి కుమ్మరి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, ఉపాధిహామీ పథకం సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ ఎం.లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవడం రైతులకు ఎంతో మేలు

- సూక్ష్మ పోషకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలి
- ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి



పాలువాయి గ్రామంలో మట్టి నమూనాల సేకరణను పరిశీలిస్తున్న ఏవో బ్రహ్మారెడ్డి

రెంటచింతల: పంటలను సాగు చేసే ముందు భూసార పరీక్షలు చేయించుకోవడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని దీంతో వారికి ఆ భూములలో సూక్ష్మ పోషకాలపై ఒక అవగాహన ఉంటుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని పాలువాయి గ్రామంలో పంట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి రైతులకు అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. మండలంలోని 12 రైతు సేవా కేంద్రాల పరిధిలో మొత్తం 384 మట్టి నమూనాలను సేకరించినట్లు తెలిపారు. సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్లయితే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరించారు. ఇనుము, మాంగనీసు, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషియం, క్లోరిన్, గంధకం అనే సూక్ష్మపోషకాలు, భూమిలో సమపాళ్లలో ఉండేలా చూసుకోవడానికి ఈ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని ఎరువులు వాడుకోవాలని జీవన ఎరువుల వాడకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సూక్ష్మపోషకాల లోపాల వలన వచ్చే తెగుళ్లను నివారించేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచినట్లయితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ గొంటు కృష్ణారెడ్డి, వీహెచ్ఏ పవన్ కిశోర్, రైతులు పాల్గొన్నారు.

కుష్ఠుతో ఎవ్వరూ అంగవైకల్యానికి గురికాకూడదు



కంటెపూడిలో మచ్చలను గుర్తిస్తున్న నాగేశ్వరరావు నాయక్



దొడ్లేరులో సర్వే చేస్తున్న సిబ్బంది

సత్తెనపల్లి డీపీఎంఓ నాగేశ్వరరావు నాయక్

సత్తెనపల్లి: కుష్ఠుతో ఎవరూ అంగవైకల్యానికి గురికాకూడదని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ (డీపీఎంఓ) డి.నాగేశ్వరరావు నాయక్ అన్నారు. ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటి సర్వేలో భాగంగా గురువారం సత్తెనపల్లి మండలం కంటెపూడిలో సర్వేను ఆయన ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సత్తెనపల్లి పట్టణంలోని మూడు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 15 బృందాలు, సత్తెనపల్లి మండలం పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 59 బృందాలు ఈ సర్వే చేస్తున్నాయన్నారు. ఒక్కో సర్వేలో మేల్ వలంటీర్, ఆశా కార్యకర్త ఉంటారని చెప్పారు. వీరిపై పర్యవేక్షణకు ఏఎన్ఎంలు ఉంటారన్నారు. సత్తెనపల్లి పట్టణంలో గురువారం 1,200 ఇళ్లను సందర్శించి 3,900 మంది వివరాలను తెలుసుకుని సర్వే చేశామన్నారు. 18 మంది అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించామని చెప్పారు. సత్తెనపల్లి మండలంలో 1,434 ఇళ్లను సందర్శించి 4,887 మంది జనాభాను సర్వే చేశామని చెప్పారు. 9 మంది అనుమానిత లక్షణాలు కలిగి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చిన్నకోటమ్మ, ఆశ కార్యకర్త, మేల్ వలంటీర్, పాల్గొన్నారు.

క్రోసూరు మండలంలో...

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమైనట్లు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఇన్నారావు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌పీహెచ్‌లు సుమారు 20 నుంచి 25 గృహాలు రోజూ సర్వే చేస్తారని చెప్పారు. తొలిరోజు దొడ్లేరు గ్రామంలో సర్వే కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశ్యాంసన్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కిరాణా వ్యాపారుల సహకారం అభినందనీయం

క్రోసూరు: పట్టణ ప్రజలకు తక్కువ ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయించేందుకు క్రోసూరు కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ముందుకు రావటం అభినందనీయం అని తహసీల్దార్ ఎం.సువర్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక ధనలక్ష్మి కిరాణా షాపులో ఏర్పాటు చేసిన రాయితీ స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. కొనుగోలుదారులకు సరకులు అందించి, మాట్లాడారు. సివిల్ సప్లయిస్ డీటీ షేక్ గఫూర్, స్టాల్ పొప్రయిటర్ చుండూరు మల్లికార్జునరావు, కిరాణా వ్యాపారులు దేవరశెట్టి నాగేశ్వరరావు, ఎర్రబాలెం కొండలు, కూరపాటి లక్ష్మీనారాయణ, కోటా ప్రభాకరరావు, కోటా భాస్కరరావు, , పలువురు తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ శ్రీనివాస్ కళ్యాణ్, ఎంవీఐ శేషురెడ్డి తదితరులు

మాచర్ల: మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మోటార్ వెహికల్ చట్టంపై న్యాయస్థానం లో అదనపు జూనియర్ అడిషనల్ సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.శ్రీనివాస్ కళ్యాణ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రమాదాలకు లోనవుతున్న వారు వాహనాలు నడపడంపై అవగాహన లేక ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వాహన చట్టాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి వాహనదారుడు ఇన్సూరెన్సు చెల్లించాలని, ప్రమాదం జరిగినప్పుడు కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి కోర్టు సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ కళ్యాణ్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శేషురెడ్డి, సీనియర్ న్యాయవాదులు సీహెచ్ నాగిరెడ్డి, గట్ల సత్యనారాయణరెడ్డి, స్వామి వివేకానంద ట్రస్టు కన్వీనర్ మెట్టు గోవింద రెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, ప్రభుత్వ న్యాయవాది వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులతో కలిసి కోర్టు నుంచి టీవీఎస్ సుజికి షోరూమ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రమాదాలకు దూరంగా ఉందాం.. భద్రతకు ప్రాధాన్యమిద్దాం.. రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం, కుటుంబాలను కాపాడుకుందాం, హెల్మెట్లు తప్పనిసరి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వై.కృష్ణమూర్తి, బాలజోజి, రమేష్‌బాబు, మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి, కోర్టు గుమస్తా బ్రహ్మారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విస్తృత తనిఖీలు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు



పాల్గొన్న అధికారులు

మాచర్ల : మాచర్ల పట్టణంలో గురువారం విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్ ప్రకాష్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబులు విస్తృతంగా విద్యుత్ కనెక్షన్ల తనిఖీలు నిర్వహించారు. 5,692 సర్వీసులు తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 98 మందికి రూ.5.2 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఈఈ జె.హరిబాబు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు చేశారు. నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ముగ్గురికి రూ.40 వేలు, విద్యుత్ మీటరు ఉన్నప్పటికీ అక్రమ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ముగ్గురికి రూ.25 వేలు, లోడింగ్‌ను అతిక్రమించి అదనంగా విద్యుత్ వాడుతున్న 87 మందికి రూ.4.03 లక్షలు, అసలు విద్యుత్ వాడకం కన్నా తక్కువ బిల్లులు చూపిస్తున్న వారికి రూ.60 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. భారత్ విద్యుత్ చట్టానికి లోబడి తనిఖీలు విస్తృతంగా నిర్వహించామన్నారు. డివిజన్ పరిధిలో 53 మంది అధికారులు, 159 మంది సిబ్బంది, 53 బృందాలుగా ఏర్పడి విద్యుత్ సర్వీసులు తనిఖీ చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తనిఖీలు చేపడతామన్నారు. అక్రమ విద్యుత్ వినియోగం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో డీఈఈ ఎం.రవికుమార్, ఎ.రామయ్య, కె.రవికుమార్, ఏఈ కోటేశ్వరరావు, ఏవో చంద్రశేఖర్, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు. మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులను చైతన్య పరిచి మీటర్‌కు సీల్ లేకపోయినా, తుప్పుపట్టినా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఉద్దేశపూర్వకంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

భార్య, పిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

నరసరావుపేట టౌన్: భార్య, పిల్లలు కనిపించటం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. రామిరెడ్డిపేటకు చెందిన కొలిశెట్టి సాంబశివరావు కిరాణ దుకాణం నిర్వహిస్తూ ఉంటాడు. గత కొన్ని రోజులుగా భార్య గీతతో మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో గీత తన కుమారుడు, కుమార్తెను తీసుకొని ఈ నెల 13వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. వారి కోసం గాలించినా ప్రయోజనం దక్కలేదు. ఈ మేరకు సాంబశివరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పరిశుభ్రతే పరమౌషధం...

వానాకాలం అంటేనే సీజనల్ వ్యాధులు విజృంభించే సమయం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో డయేరియాతోపాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అతిసారతో కొన్ని ప్రాంతాల్లో ప్రాణాలు కూడా పోతున్నాయి. కొన్నిసార్లు ప్రాణాపాయం తప్పినా ఆస్పత్రి ఖర్చులు రూ.వేలల్లో ఉండటం పేద, మధ్య తరగతి కుటుంబాలకు పెద్ద భారమేనని చెప్పాలి. దీనికంతటికీ పరిష్కారం పరిశుభ్రతే. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరిచేరనీయకుండా చూసుకోవచ్చు. అటు ఆరోగ్యపరంగా, ఇటు ఆర్థికంగా కూడా కుటుంబం హాయిగా ఉండొచ్చు. ఇది ఎవరికివారు జాగ్రత్త పడాల్సిన సమయం. మరోవైపు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్య నిపుణులు కూడా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మున్సిపల్ యంత్రాంగం కూడా మురుగు కాలువల్లో పూడికతీత, ఇళ్లలో రోజువారీ వచ్చే వ్యర్థాల తొలగింపు, దోమల నివారణపై దృష్టి సారించింది.

- సీజనల్ వ్యాధుల విషయంలో జాగ్రత్తలు ముఖ్యం
- నిత్యం అప్రమత్తత అవసరమంటున్న వైద్యనిపుణులు
- పారిశుద్ధ్యంపై దృష్టి సారించిన మున్సిపల్ యంత్రాంగం



రఘురామ్‌నగర్‌లో కాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు

సత్తెనపల్లి: వ్యాధుల విషయంలో ప్రజలు నిత్యం చైతన్యవంతులై అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే అనారోగ్యాల బారిన పడతారని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను అందరూ పాటించాలని ప్రచారం చేస్తున్నారు. పట్టణం, గ్రామ పంచాయతీలలో స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నామని గుర్తుచేస్తున్నారు. వ్యాధుల నివారణకు సహకరించి ఇళ్ల వద్దకు వచ్చే వైద్య సిబ్బంది సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలంటున్నారు. అడపాదడపా ముసురు పట్టి కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే చేపట్టాల్సిన చర్యలను వివరిస్తున్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని మురుగు కాలువల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి తొలగింపజేస్తోంది.

అధికారులు వీటిపైనా దృష్టి పెడితేనే...

తాగునీటి పైపులకు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలి. వీధి కుళాయిల వద్ద సిమెంట్‌తో నీరు నిల్వ లేని విధంగా ఏర్పాటు చేయాలి. ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రపరిచేలా చూడాలి. దోమలు పెరగకుండా పరిసరాల్లోని నీటి కుంటలను వెంటనే పూడ్చి వేయాలి. పూడ్చడానికి వీలులేని నీటి కుంటలలో కిరోసిన్‌గానీ, మడ్ ఆయిలుగానీ వేస్తే దోమల లార్వాలు నశిస్తాయి. ఆ మేరకు చర్యలు తీసుకోవాలి. మురుగు కాలవల్లో ఉన్న అడ్డంకులను తొలగించి ఎప్పటికప్పుడు నీరు పారేలా చేయాలి. పట్టణ, గ్రామ పరిసరాల్లోని చెత్తాచెదారాలను తొలగించి బ్లీచింగ్, సున్నాన్ని 1:4 నిష్పత్తిలో కలిపి చల్లాలి. దోమల నివారణకు ఒక భాగం మలాథియన్‌కు, 10 భాగాల నీటిని కలిపి నాప్సాక్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయాలి. దోమల నివారణకు ఒక లీటరు పైరెత్రమ్‌కు 20 లీటర్ల డీజిల్ కలిపి ఫాగింగ్ నిర్వహించాలి.

ప్రజలపరంగా ఆచరించాల్సినవి...

వర్షపు నీరు చేరకుండా గృహ పరిసరాల్లో ఉన్న పనికిరాని వస్తువులు, రోళ్లు, పగిలిపోయిన మట్టి కుండలు, టైర్లు, పూలకుండీలు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు వంటి వాటిని తొలగించాలి. అలాగే సెప్టిక్ ట్యాంక్ ఎయిర్ పైపుల పైన జల్లెడలకు పలుచని వస్త్రాన్ని చుట్టాలి. ఇలా చేస్తే సెప్టిక్ ట్యాంకు లోపల దోమలు గుడ్లు పెట్టకుండా అరికట్టవచ్చు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా నీటి తొట్టెలను శుభ్రపరిచి, ఆరబెట్టి, తిరిగి నీటితో నింపడం వల్ల దోమల లార్వా పెరుగుదలను అరికట్టవచ్చు. దోమ లార్వా నివారణకు 10 లీటర్ల నీటిలో 5 మీ.లీ. ఎబేట్ ద్రావణాన్ని కలిపి నీటి నిల్వలపై పిచికారీ చేయాలి. కలుషిత నీటిని తాగడం వల్ల వ్యాధులు వస్తాయి. డయేరియా, కలరా, టైఫాయిడ్, కామెర్లు వంటి ప్రాణాంతక వ్యాధులు ఈ కాలంలో సంక్రమిస్తాయి. సురక్షితమైన, క్లోరినేషన్ చేసిన, కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వీధుల్లో లభించే అపరిశుభ్ర ఆహారం, తినుబండారాలు వంటివి తినకూడదు. విరేచనాలు, వాంతులు, జ్వరం ఉన్న వారు అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యులను, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను లేదా ఏఎన్ఎంలను సంప్రదించి తక్షణ వైద్య సహాయం పొందాలి. దోమకాటు వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా లాంటి ప్రమాదకర వ్యాధులు వస్తాయి. దోమలు పెరిగే అవకాశం లేకుండా మీ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. మున్సిపల్/పంచాయతీ డ్రెయినేజీలలో చెత్త వేసి పారిశుద్ధ్య సమస్యలు పెంచొద్దు. డ్రెయినేజీ లేని ఏరియాలలో నీరు నిల్వ ఉండే మంచినీటి కుళాయిల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. ఖాళీ స్థలాల్లో వాటి యజమానులు తక్షణమే పిచ్చి మొక్కలు, వ్యర్థాలు ఉంటే తొలగించాలి.

రాయితీ సరకులను సద్వినియోగం చేసుకోండి



సరకులు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ మురళీకృష్ణ

సత్తెనపల్లి: రాయితీపై అందించే బియ్యం, కందిపప్పును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సత్తెనపల్లి ఆర్డీఓ వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని గుంటూరు రోడ్‌లోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లులో గురువారం రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో సబ్సిడీ ద్వారా కిలో బియ్యం రూ.49, కందిపప్పు రూ.160కి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాన్ని నడిపేందుకు ముందుకు వచ్చిన గుండా పూర్ణ చంద్రరావును అభినందించారు. పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ అరుణ, ఆర్యవైశ్య నాయకులు డి. శ్రీనివాసరావు, మద్ది వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.